కేసీఆర్ పాలన సంక్షేమ స్వర్ణయుగం

10th పదేండ్ల మన తెలంగాణ

కేసీఆర్ పాలనలో సంక్షేమానికే 2,86,230 కోట్లు

దేశానికి దిక్సూచిగా బీఆర్ఎస్ సర్కారు పథకాలు

- సామాజిక విప్లవం.. మహిళా సాధికారతకు పెద్దపీట
- దళితబంధుతో ఎస్సీలకు సామాజిక ఆదరణ, గౌరవం
- కల్యాణలక్ష్మి పథకంతో బాల్యవివాహాలకు అడ్డుకట్ట
- గురుకులాలతో అట్టడుగు వర్గాల్లో అక్షర కాంతులు
- ఉపాధి అవకాశాలతో పేదరిక నిర్మూలనకు బాటలు
- కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అంతా అస్తవ్యస్తం

ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గురుకుల విద్యాలయాలు, ఉచిత విద్యుత్తు, గొర్ల పంపిణీ, చేపల పంపిణీ, పల్లెప్రగతి, రైతుబీమా, రైతుబంధు, టీ హబ్.. ఇలా ప్రతి వర్గానికి ఏదో లబ్ధి చేకూర్చే పథకాలను కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టింది. ఫలితంగా అట్టడుగు వర్గాల ఆర్థిక అభ్యున్నతికి కొత్త బాటలు పడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కేసీఆర్ పదేండ్ల పాలన సంక్షేమంలో స్వర్ణయుగం.

వర్గం/పథకం	ఖర్చు
ఆసరా పింఛన్లు	రూ.61 వేల కోట్లు
కల్యాణలక్ష్మి	రూ.11,743 కోట్లు
కేసీఆర్ కిట్	రూ.1,500 కోట్లు
ఎస్సీ సంక్షేమం	రూ.92,640 కోట్లు
ఎస్టీ సంక్షేమం	రూ.43,936 కోట్లు
బీసీ సంక్షేమం	రూ.44,393 కోట్లు
మైనార్టీ సంక్షేమం	రూ.9166 కోట్లు
సీఎంఆర్ఎఫ్	రూ.3,000 కోట్లు
దివ్యాంగుల సంక్షేమం	రూ.10,300 కోట్లు
67,034 వేల మందికి పెన్షన్	రూ.882 కోట్లు
చేనేత రంగం (ఏటా)	రూ.1,200 కోట్లు

కేసీఆర్ ప్రభుత్వం సాధించిన సామాజిక మార్పులు:

తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో పేదరికం 21.92 శాతం ఉండగా, 2023 నాటికి 5.8 శాతానికి తగ్గింది. అంటే పదేండ్లలో పేదరికం 16.12 శాతం తగ్గింది.

గురుకుల విద్యను అందుబాటులోకి తీసుకురావటంతో ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ తదితర ఉన్నత విద్యాప్రవేశాల్లో మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. పీజీ కోర్సుల్లో 72 శాతం, డిగ్రీలో 52 శాతం, బీఈడీ కోర్సుల్లో 81 శాతం అమ్మాయిలే చేరటం అందుకు నిదర్శనం.

ఉచిత కోచింగ్ ఫలితంగా దాదాపు 650 మందికిపైగా బాలికలు మెడిసిన్ సీట్లు సాధించారు.

మహిళా శ్రామిక భాగస్వామ్యంలో 37 శాతంతో దేశంలోనే తెలంగాణ టాప్‌గా నిలిచింది.

16-19 ఏండ్ల మధ్య తల్లులయ్యేవారి సంఖ్య 10.6 శాతం నుంచి 5.8 శాతానికి తగ్గింది.

మహిళల బ్యాంక్ అకౌంట్లు 59.5% నుంచి 84.4 శాతానికి పెరిగాయి.

కల్యాణలక్ష్మి/షాదీముబారక్‌తో బాల్యవివాహాలు తగ్గిపోయాయి. తద్వారా మాతాశిశు మరణాల రేటు రికార్డుస్థాయిలో లక్షకు 96 నుంచి 52కు తగ్గిపోయింది. శిశుమరణాల రేటు వెయ్యికి 39 నుంచి 21కు తగ్గిపోయింది. ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీస్ 91-97కు పెరిగాయి.

స్త్రీ, పురుష నిష్పత్తి 1007-1049కు పెరిగింది.

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం ఛిన్నాభిన్నమై, దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కొన్నది. కానీ, స్వరాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ సంక్షేమరంగం కేసీఆర్ పాలనలో దేశానికి దిక్సూచిగా నిలిచింది. రాష్ట్ర ఆవిర్భావం నుంచీ కేసీఆర్ ఎప్పటికప్పుడు అనేక విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుడుతూ సబ్బండ వర్గాల సంక్షేమానికి కొత్త బాటలు వేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం ఆశించినస్థాయికి మించి సత్ఫలితాలను సాధించింది. రాష్ట్రంలో సరికొత్త సామాజిక విప్లవానికి బాటలు వేసింది.

పేదరిక నిర్మూలన

దేశవ్యాప్తంగా రోజురోజుకు పేదరికం పెరుగుతుంటే.. సంక్షేమ పథకాల ఫలితంగా తెలంగాణ మాత్రం పేదరిక నిర్మూలన దిశగా సాగింది. వ్యవసాయ రంగం స్థిరీకరణ, వ్యవసాయనుబంధ రంగాలు, కులవృత్తుల ప్రోత్సాహంతో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు పెరిగాయి. కూలీ రేట్లు పెరిగాయి. చేతినిండా, పనికి తగిన వేతనం పొందగలిగే పరిస్థితులు వచ్చాయి. వెరసి తాత్కాలిక, అంతర్గత వలసలు పూర్తిగా తగ్గిపోయాయి. ఆసరా పింఛన్లు, ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం పంపిణీ అట్టడుగువర్గాల ప్రజల కడుపు నింపాయి. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో పేదరికం 21.92 శాతం ఉండగా, ప్రస్తుతం 5.8 శాతానికి పడిపోయింది. మొత్తంగా పదేండ్లలో 16.12 శాతం పేదరికం తగ్గటమే కేసీఆర్ సంక్షేమ పాలనకు నిలువెత్తు నిదర్శనం.

చేతల్లో మహిళా సాధికారత

బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేసింది. ఆడబిడ్డలకు ఉన్న తన్స్థానాన్ని కల్పించింది. రేషన్ కార్డయినా, రెండు పడక గదుల ఇల్లయినా, కల్యాణలక్ష్మి/షాదీముబారక్, దళితబంధు చెక్కులైనా ప్రభుత్వం అమలు చేసే పథకమేదయినా.. ఆడబిడ్డ పేరిటే అందించింది. ఆడబిడ్డ గర్భం దాల్చింది మొదలు సుఖప్రసవమై తిరిగి ఇంటికి చేరేవరకూ కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి పథకాలు అండగా నిలిచాయి. మాతాశిశుమరణాలకు స్వస్తి పలికాయి. కేజీటు పీజీ వరకు ఉచిత విద్య కోసం ప్రవేశపెట్టిన గురుకుల విద్యాలయాలు లక్ష్యానికి మించి ఫలితాలు సాధించాయి. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బాల్యవివాహాల నిర్మూలనకు దోహదపడ్డాయి. నామినేటెడ్ పోస్టులు మొదలు, పంచాయతీలు, మున్సిపాలిటీల్లోనూ మహిళలకు సగం స్థానాలు కట్టబెట్టి రాజకీయ అవకాశాలను కల్పించి రాష్ట్ర అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేసింది.

అందుబాటులోకి అందరికీ విద్య

అట్టడుగు వర్గాల విద్యాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ కలిపి 1,022 గురుకులాలను నెలకొల్పింది. అందులోనూ అత్యంత వెనకబడిన, అనాథ బాలలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలుచేసి విద్యాప్రవేశాలను కల్పించింది. డిగ్రీ వరకు ఉచితంగా ఉన్నతవిద్యను అందించింది. అట్టడుగువర్గాల్లో అక్షరకాంతులను నింపుతూ, నవ, విద్యాతెలంగాణ నిర్మాణానికి బాటలు వేసింది.

దళితక్రాంతి

దళితుల సముద్ధరణకు కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా దళితబంధు పథకాన్ని అమలు చేసింది. సొంత వ్యాపారాలు చేసుకోవటానికి, తెలిసిన, నచ్చిన ఉపాధిమార్గాన్ని ఎంచుకుని జీవించడానికి నిరుపేద దళిత కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా, బ్యాంకు లింకేజీ లేకుండా రూ.10లక్షల నగదును అందించింది. పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 40 వేల దళిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేసింది. దీంతో కూలీబిడ్డలు ఓనర్లుగా ఎదుగుతుండటం ఒక విశేషమైతే, సామాజిక మార్పునకు ఇది దోహపడుతున్నది. ఈ పథకం యావత్తు దేశాన్నే ఆకట్టుకుంటున్నది.

సంక్షేమం కోసమే రూ.2,86,230 కోట్లు ఖర్చు

150కి పైగా వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు

ఉద్యోగుల సంక్షేమం: కేవలం జీతాలు, పెన్షన్లకే "రూ.3.41 లక్షల కోట్లు

హస్తం పార్టీ పాలనలో సంక్షేమానికి రిక్తహస్తం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అంతా అస్తవ్యస్తంగా మారింది. పేదల కోసం మానవీయ కోణంలో కేసీఆర్ అమలు చేసిన అనేక పథకాలను రేవంత్‌రెడ్డి సర్కార్ నిలిపేసింది. విదేశీవిద్యానిధి, దళితబంధు, బీసీలకు ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ, సీఎంఆర్ఎఫ్ ఇలా అనేక పథకాలను పెండింగ్‌లో పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల నాటి హామీల సంగతి అటుంచితే మార్గదర్శకాల పేరిట ఉన్న పథకాల అమలుకు తిలోదకాలిచ్చేందుకు సమాయత్తమవుతున్నది. దీంతో ఏ పథకం అమలవుతుందో? ఏది నిలిచిపోతుందో? తెలియని దుస్థితి నెలకొన్నది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు మినహా మరే పథకాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేసింది లేదు.

27న ఓటు హక్కు ఉన్న వారికి సెలవు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను ఇస్తూ సీఈవో వికాస్‌రాజ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు సంస్థలు, కార్యాలయాల్లో పని చేసే వారు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పని వేళల్లో వెసులుబాటు కల్పించాలని ఆయా సంస్థలకు సూచించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ

హైదరాబాద్, మే24 (నమస్తే తెలంగాణ): వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డి అని కొనియాడారు. రాకేశ్‌రెడ్డి గెలుపుకోసం మున్సిపల్ కో ఆప్షన్లు, బీసీ, ఎంబీసీ నాయకులు కృషి చేయాలని కోరారు.

చెట్లు నరికినందుకు విద్యుత్ శాఖకు నోటీసు

24 లక్షలు చెల్లించాలన్న కమిషనర్

నమస్తే ఎఫెక్ట్

సిద్దిపేట, మే 24: సిద్దిపేటలో హరితహారం చెట్లను నరికినందుకు విద్యుత్‌శాఖకు రూ.24 లక్షలు జరిమానా చెల్లించాలని శుక్రవారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 19, 22న సిద్దిపేటలోని రాజీవ్ రహదారి, మెదక్‌రోడ్, ఎన్సాన్‌పల్లిరోడ్, సిరిసిల్ల బైపాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ వారు 400 చెట్లు నరికి వేశారు. వాల్టా చట్టం 2002 లోని సెక్షన్ 35 (చాప్టర్-6)లోని సబ్ సెక్షన్ 3 కింద రూ.24 లక్షలు పరిహారంగా చెల్లించాలని, ఆ చెట్ల స్థానంలో 400 కొత్త చెట్లను నాటడానికి విద్యుత్ శాఖ బాధ్యత తీసుకోవాలని నోటీసులో కమిషనర్ పేర్కొన్నారు. హరితహారం చెట్ల నరికివేతపై ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనాలను చూసి మున్సిపల్ కమిషనర్ స్పందించారు.

తులం ఇనుమూ ఇవ్వరు

మొదటిపేజీ తరువాయి...

ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి లాంటి ఇంద్రజాలికుడిని ఎక్కడా చూడలేదని ఎద్దేవా చేశారు. నోటిఫికేషన్లు లేవు.. రాత పరీక్షలు లేవు.. కానీ, 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని దొంగ మాటలు చెప్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామకపత్రాలు ఇచ్చి వాటిని సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకోవడం రేవంత్‌రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేశారని రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. 'ఏ ముఖ్యమంత్రి అయినా రాష్ట్రం అప్పుల్లో ఉన్నదని చెప్తారా? దివాలా తీసిందని అంటారా? ఇట్లా మాట్లాడితే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయా?' అని ప్రశ్నించారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రజలకు రేవంత్‌రెడ్డి గాడిదగుడ్డునే చేతిలో పెట్టడం ఖాయమని హెచ్చరించారు. జీవో 46 ఇబ్బందులను అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి తమతో చర్చించారని, అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అది అలాగే మిగిలిపోయిందని చెప్పారు. జీవో 46పై ప్రభుత్వంపై కొట్లాడేందుకు తమ ఎమ్మెల్యేలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

మహాలక్ష్మి పథకంపై అబద్ధాల ప్రచారం

తెలంగాణలో పదేండ్ల నిజం ఒకవైపు, ఆరు నెలల అబద్ధాల హామీలు మరోవైపు ఉన్నాయని అని కేటీఆర్ వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమికొట్టింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీరు అందించి ఫ్లోరైడ్‌ను రూపుమాపారని గుర్తుచేశారు. వెయ్యేండ్లు గుర్తుండి పోయేలా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మించింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం తెలంగాణలో అమలవుతున్నదంటూ రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు.



నకిరేకల్‌లో సమావేశానికి హాజరైన పట్టభద్రులు, బీఆర్ఎస్ శ్రేణులు

ఇటు బిట్స్ పిలానీ, అటు పల్లీ బఠాణీ

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికలో ఇటువైపు బిట్స్ పిలానీ, అటువైపు పల్లీ బఠాణీ ఉన్నారని, ఎవరు కావాలో పట్టభద్రులే నిర్ణయించుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడు, గోల్డ్ మెడలిస్ట్ కాగా, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నపై 56 క్రిమినల్ కేసులు ఉన్నాయని, 74 రోజులు చంచల్‌గూడ జైలు జీవితం గడిపారని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఉప ఎన్నికలో పట్టభద్రులు ఆలోచించి ఓటేస్తే కాంగ్రెస్‌కు మొదటి హెచ్చరిక చేసినట్టు అవుతుందని పిలుపునిచ్చారు. శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించేటోడు ఉండాలి కానీ, ప్రభుత్వాన్ని ప్రశంసించేటోడు కాదని చెప్పారు. ఏనుగుల రాకేశ్‌రెడిని గెలిపిస్తే నిరుద్యోగుల, విద్యార్థుల, ఉద్యోగుల సమస్యలపై నిలదీస్తారని చెప్పారు. తీన్మార్ మల్లన్న గెలిస్తే.. దందాలు, బ్లాక్‌మెయిలింగ్స్ తప్ప ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని స్పష్టంచేశారు.

తీన్మార్ మల్లన్నతో కోమటిరెడ్డి బ్రదర్స్‌కు కొత్త భయం: జగదీశ్‌రెడ్డి

తీన్మార్ మల్లన్న తమ పదవులకు ఎక్కడ ఎసరు పెడతాడోనన్న భయం కోమటిరెడ్డి బ్రదర్స్‌కు పట్టుకున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గతంలో ఇద్దరినీ యూట్యూబ్ చానల్‌లో ఇరుకున పెట్టిన చరిత్ర మల్లన్నదని గుర్తుచేశారు. అలాంటి బ్లాక్‌మెయిలర్ చేతికి ఆయుధమిస్తే సమాజానికి ప్రమాదమని హెచ్చరించారు. అందుకే నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డులు, అమ్మాయిలకు స్కూటీ ఇవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక సెల్‌ఫోన్ లైట్లతో ఆపరేషన్లు చేస్తున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. ఇది చేతగాని, పనిచేయలేని, మోసకారి ప్రభుత్వం అని ప్రజలకు అర్థమైందని పేర్కొన్నారు. ఆయా సమావేశాల్లో జెడ్పీ చైర్మన్లు బండ నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, అంజయ్య, చిరుమర్తి లింగయ్య, రమావత్ రవీంద్రకుమార్, గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, అంజయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

డీజీపీ, ఆర్టీసీ ఎండీనీ కోర్టుకు లాగుతాం

- కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్న వారిపై కేసు పెడ్తలేరేం
- ఆర్టీసీ లోగో వ్యవహారంపై ఎక్స్ వేదికగా కేటీఆర్ ఫైర్
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే నాపై తప్పుడు కేసు
- డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ స్పష్టం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ)/పాలకుర్తి: టీఎస్ఆర్టీసీ లోగో విషయంలో కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్న వ్యక్తులపై కేసులు ఎందుకు పెట్టడంలేదని డీజీపీ రవిగుప్తా, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశ్నించారు. రాజకీయ పెద్దల మాటలు విని వేధిస్తే మిమ్మల్ని కూడా కోర్టుకు లాగుతామని హెచ్చరించారు. టీఎస్ఆర్టీసీ కొత్త లోగో వివాదంపై శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ఆర్టీసీ కొత్త లోగో అంటూ ప్రచారం చేసిన ఎన్టీవీ, బిగ్‌టీవీ చానెళ్లు, వెలుగు దినపత్రికపై ఎందుకు కేసులు పెట్టలేదని నిలదీశారు. తన బంధువుకు రూ.10 వేల కోట్ల కొవిడ్ కాంట్రాక్ట్ వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారని, సచివాలయం కందకాల్లో నిజాం నగలు తవ్వుకున్నట్టు నకిలీ కథలు అల్లారని గుర్తుచేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నకిలీ వీడియోను రేవంత్‌రెడ్డి ప్రచారం చేశారని పేర్కొన్నారు. ఓయూకు చెందిన నకిలీ సర్క్యులర్‌ను సీఎం పోస్ట్ చేశారని, తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్న ఆ వ్యక్తిని జైల్లో ఎందుకు పెట్టడంలేదని పోలీసు యంత్రాంగాన్ని ప్రశ్నించారు.

బెదిరేది లేదు: దిలీప్

సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే పోలీసులు తనపై తప్పుడు కేసు పెట్టారని తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ ఆరోపించారు. ఇలాంటి కేసులు ఎన్నిపెట్టినా బెదిరేది లేదని, న్యాయస్థానాల మీద పూర్తి నమ్మకం ఉన్నదని ఎక్స్ వేదికగా శుక్రవారం పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు కేసీఆర్ ప్రభుత్వ ఆనవాళ్లు తుడిచేస్తామంటూ వివిధ సంస్థల పేర్లు మార్చే పనికిమాలిన పని ఒకటి పెట్టుకున్నదని, దీనిలో భాగంగానే టీఎస్ ఆర్టీసీ సంస్థ పేరును టీజీఎస్ ఆర్టీసీగా మార్చిందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక వాట్సాప్ గ్రూపులో ఆర్టీసీ కొత్త లోగో అంటూ ఒక ఇమేజ్ పంపారని, ఆ లోగోను 22న అనేక మీడియా సంస్థలు ప్రచురించాయని తెలిపారు. కొత్త లోగోలో పాత ఆర్టీసీ లోగోలో ఉన్న చార్మినార్, కాకతీయ తోరణం లేకపోవడం గురించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టానని పేర్కొన్నారు.

ప్రశ్నించే గొంతులపై కేసులు: హాలీశ్‌రెడ్డి

ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భయందోళనకు గురిచేస్తున్నదని బీఆర్ఎస్ ఎన్నారై సెల్ నాయకుడు వ్యాళ్ల హరీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. గాంధీ దవాఖానలో కరెంటు పోయిన వీడియో, ఆర్టీసీ లోగోపై తాను చేసిన పోస్టులను అడ్రస్ చేసుకుంటూ కేసులు పెట్టారని విమర్శించారు. గాంధీ దవాఖానలో కరెంటు పోయిన విషయం పాత వీడియో అని తెలిసి వెంటనే డిలీట్ చేసినా కావాలని కేసు పెట్టారన్నారు.

దేశ చరిత్రలోనే అరుదైన విప్లవం

కేసీఆర్ వైద్య రంగంపై ఎక్స్ వేదికగా కేటీఆర్

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ):'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు..' అనే దుస్థితి నుంచి పోదాం పద సర్కారు దవాఖానకే అనే ధీమాను ఇచ్చింది కేసీఆర్ పాలన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో వైద్య ఆరోగ్యరంగం ప్రగతిపై శుక్రవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. జననం నుంచి మరణం దాకా, ప్రతి దశలో మన సర్కారు ఉన్నది అనే గొప్ప భరోసా ప్రజలకు కల్పించామని, కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు, డయాలసిస్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ కేంద్రాలు, బస్తీ దవాఖానలు, మాతాశిశు కేంద్రాలు నగరం నలుమూలల సూపర్ స్పెషాలిటీ దవాఖానలు, వరంగల్ నడిబొడ్డున దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ హాస్పిటల్ నిర్మించామని గుర్తుచేశారు. జనాభా దామాషాలో మరే రాష్ట్రంలో లేనన్ని మెడికల్ సీట్లు, ఒకటా, రెండా ఇలా.. కేసీఆర్ పాలనలో వైద్య ఆరోగ్య రంగం దేశ చరిత్రలోనే ఒక అరుదైన విప్లవమని పేర్కొన్నారు.

---

12 కిలోల మీనం

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తల్పునూర్ గ్రామ శివారులో ఉన్న చిట్టెమ్మ చెరువులో నీళ్లు అడుగంటడంతో మత్స్యకారులు శుక్రవారం చేపలు పట్టారు. గ్రామానికి చెందిన మత్స్యకారుడు భాస్కర్ వలకు 12 కిలోల రవుట చేప చిక్కడంతో సంబురపడ్డాడు.

- గోపాల్‌పేట

మావాళ్లతో కొట్టిస్తం.. సస్పెండ్ చేయిస్తం

మొదటిపేజీ తరువాయి...

నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో శుక్రవారం జరిగింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి డిపోకు చెందిన బస్సు హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి సూర్యాపేటకు బయల్దేరి నకిరేకల్‌లో ఆగింది. బస్సులో దాదాపు 110 మంది ప్రయాణికులున్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న నలుగురిలో ఓ మహిళ నకిరేకల్‌లో తన బంధువు వస్తుందని, కాసేపు ఆగాలని డ్రైవర్‌ను కోరింది. అప్పటికే ఐదు నిమిషాలు ఆపిన డ్రైవర్, తోటి ప్రయాణికుల గొడవతో చేసేదేంలేక బస్సును కొంతదూరం పోనిచ్చాడు. ఇలా చేయడమే పొరపాటైంది. ఒక్కసారిగా నలుగురు మహిళలు లేచి డ్రైవర్‌ను బూతులు తిట్టారు. సూర్యాపేటలో తమ వాళ్లతో కొట్టిస్తామని, ఉద్యోగం ఎట్లా చేస్తారో చూస్తామని, సస్పెండ్ చేయిస్తామని శివాలూగారు. అప్పటిదాకా ఓపిక పట్టిన డ్రైవర్, వాళ్లు తిడుతుండడంతో బస్టాండ్ నుంచి యూటర్న్ తీసుకొని అర కిలోమీటరు దూరంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు బస్సును తీసుకొచ్చాడు. తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారని నలుగురు మహిళలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ వచ్చి వారిని స్టేషన్‌కు రమ్మని కోరినా ఆ మహిళలు అస్సలు పట్టించుకోకుండా వారితోనూ గొడవకు దిగారు. బస్సులో ఉన్న వాళ్లు ఎంత నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ఓ సందర్భంలో ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించేందుకు ప్రయత్నించారు. చివరికి కండక్టర్ నల్లగొండ డీఎం రామ్మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మిగతా ప్రయాణికులతో సాక్షి సంతకాలు తీసుకొని ఫిర్యాదు చేసి సూర్యాపేటకు బస్సును తీసుకెళ్లండని డీఎం చెప్పడంతో చేసేదేంలేక వెనుదిరిగారు.